క్లుప్తంగా

మల్లయ్యపల్లిలో బోరుబావి తవ్వకం

ఎల్లారెడ్డి: మల్లయ్యపల్లి గ్రామంలో బోరుబావి తవ్వకం పనులను ఆదివారం చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు జీపీ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వం బోరు బావి వేయించింది. మాజీ సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీ సంతోష్ కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఎన్నికలు



బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో ఆదివారం రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, బాన్సువాడ పద్మశాలి సంఘం అధ్యక్షులు జిల్లా కాశీనాథ్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంఘంలో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజు, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, రమేష్, బాలరాజ్, అనిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ వర్ధంతి



దోమకొండ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం నేతాజీ సుభాష్ చంద్ర బోస్ వర్ధంతిని జరుపుకున్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దోమకొండ బీజేపీ నాయకులతో పాటు సుభాష్ చంద్రబోస్ యువసేన ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

బాన్సువాడలో భారీ వర్షం



బాన్సువాడ రూరల్: ఆదివారం బాన్సువాడ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మండలంలోని గట్టుమీది గ్రామాలైన హన్మాజీపేట్, కోనాపూర్, సంగోజీపేట్ గ్రామాలను భారీ వర్షం ముంచెత్తింది. ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఆదివారం కురిసిన భారీవర్షం కాస్త ఉపశమనం ఇచ్చింది. మెట్ట ప్రాంతంలో సాగవుతున్న ఆరు తడి పంటలకు ఈ వర్షం ప్రాణం పోసిందని రైతులు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి



మాచారెడ్డి: సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాచారెడ్డి ఎస్సై అనిల్ సూచించారు. ఆదివారం పాల్వంచ మండలం కేంద్రంలో సైబర్ నేరాలు, షీ టీములు, 1930, 100 డయల్ పట్ల అవగాహన కల్పించారు. ఈ మధ్య సైబర్ నేరాలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ఓటీపీ, ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు చెప్పొద్దన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు.

రామేశ్వర్ గుట్ట మహోత్సవ మహాపాదయాత్ర



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని పలు గ్రామాలలో కీర్తిశేషులు హరి పారాయణ్ మారుతి మహరాజ్ ఆధ్వర్యంలో రామేశ్వర్ గుట్ట వరకు దిండి మహోత్సవ మహాపాదయాత్రను ఆదివారం ప్రారంభించారు. పాదయాత్రలో వస్తున్న భక్తులకు బేగంపూర్ చౌరస్తాలోని పంచపురి హనుమాన్ మందిర్ వద్ద ఉప్పరి అంజయ్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంతేశ్వర్ గురూజీ మాట్లాడుతూ.. శ్రావణమాసం పురస్కరించుకొని ప్రతి సంవత్సరం పిట్లం మండలంలోని చిన్నకొడప్‌గల్ క్షేత్ర సిద్దిరామేశ్వర ఆలయానికి దిండి పాదయాత్రగా వెళ్తారు. లాడేగావ్ నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరి సాయంత్రం ఆలయానికి చేరుకుంటామన్నారు.

వేతన వేదన

- ధరణి ఆపరేటర్లకు ఆరు నెలలుగా అందని జీతాలు
- కుటుంబాలు గడవక ఆర్థికంగా ఇబ్బందులు
- జిల్లాలో 25 మంది ఆపరేటర్లు, ఒక కో–ఆర్డినేటర్



కామారెడ్డిలో జిల్లా అడ్మినిస్ట్రేటివ్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న ధరణి ఆపరేటర్లు(ఫైల్)

రాజంపేట: ధరణి పోర్టల్ ఆపరేటర్లకు ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో వారి కుటుంబాలు గడవక ఆర్థికంగా నానా ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది. వీటి వ్యవహారాలను ధరణి ఆపరేటర్లకు అప్పగించింది. ఇందులో భాగంగా అన్ని తహసీల్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల కోసం ప్రత్యేకంగా(ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్) సిబ్బందిని నియమించింది. 2018 నుంచి వీరు విధులు నిర్వహిస్తున్నారు. వీరి వేతనాలు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో 25 మంది ఆపరేటర్లు ఒక జిల్లా కో–ఆర్డినేటర్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి వీరికి వేతనాలు అందడం లేదు. నియామక సమయంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇంక్రిమెంట్ ఉంటుందని, ఏజెన్సీ వారు తెలియజేసినప్పటికీ అది లేకపోగా ఏ ఒక్క నెలలో కూడా సక్రమంగా జీతాలు ఇచ్చిన దాఖలాలు లేవని ఆపరేటర్లు పేర్కొంటున్నారు.

వేతనాలు చెల్లించాలని ధరణి ఆపరేటర్లు జిల్లా ఉన్నతాధికారుకు పలుమార్లు వినతి పత్రాలు అందజేశారు. ఇటీవల జిల్లాలోని ప్రత్యేక పాలనాధికారికి వినతి పత్రం అందజేసినట్లు ఆపరేటర్లు తెలిపారు. రెండు రోజుల క్రితం కామారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు చెప్పారు. అయితే ప్రభుత్వం నుంచి నెలవారీ వేతనంగా రూ.29,500 చెల్లిస్తున్నా ఏజెన్సీ వారు తమ ఖాతాలో కేవలం రూ.12,031 మాత్రమే జమ చేస్తున్నారని ఆపరేటర్లు పేర్కొంటున్నారు.

నెలనెలా వేతనాలు అందించాలి

ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలి.

– మహేష్, ధరణి ఆపరేటర్, రాజంపేట



గోపాల్‌పేటలో వెలసిన రాఖీ దుకాణం



లింగంపేట బస్టాండు ప్రాంతంలో..

వెలసిన రాఖీ దుకాణాలు

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రాఖీ దుకాణాలు వెలిశాయి. చిన్నారులు, యువతులు, మహిళలు రాఖీ దుకాణాల వద్ద బారులు తీరారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది భిన్నమైన రాఖీలు మార్కెట్‌లోకి వచ్చాయి. చిన్నపిల్లలు ఇష్టపడేరీతిలో వివిధ రకాల బొమ్మల రాఖీలు మార్కెట్‌లో దర్శనమిచ్చాయి. కొన్నిచోట్ల రక్షాబంధన్ వేడుకలు ముందస్తుగా జరుపుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



బిచ్కుందలో రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



బాన్సువాడ బీసీ హాస్టల్‌లో రాఖీ వేడుకలు

సాంకేతిక లోపంతో రుణమాఫీ కాలేదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత చంద్రకాంత్‌రెడ్డి

భిక్కనూరు: సాంకేతిక లోపం కారణంగా కొంత మంది రైతులకు రుణమాఫీ జరగలేదని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ గాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రుణమాఫీ కాని రైతులు పూర్తి వివరాలను వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని ఈ సందర్భంగా సూచించారు. నాయకులు అంకం రాజు ఉన్నారు.



జిల్లా కేంద్రంలో పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ



లింగంపేటలో జయంతి నిర్వహిస్తున్న గౌడ సంఘం సభ్యులు

సర్వాయి పాపన్నకు ఘన నివాళులు

బహుజన స్రామాజ్య వ్యవస్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. పాపన్నగౌడ్ చిత్రాపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. బడుగు బలహీనవర్గాల కోసం ఆయన చేసిన సేవలను గౌడ సంఘం సభ్యులు కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో..



కొండాపూర్‌లో..



బీబీపేటలో ..



రాజంపేటలో..



జుక్కల్‌లో..



పిట్లంలో ..



నస్రుల్లాబాద్‌లో ..



గోపాల్‌పేటలో ..



దోమకొండ మండలం ముత్యంపేటలో..



బాన్సువాడలో నివాళి అర్పిస్తున్న బీజేపీ నేతలు



భిక్కనూరులో..



దోమకొండలో..



పెద్దకొడప్‌గల్ గాంధీ చౌరస్తాలో..

దుండగులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ నాయకులు



కొత్తాబాదిలో నివాళులర్పిస్తున్న యువకులు

కామారెడ్డి: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని టీపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, అనిల్‌కుమార్‌లు మాట్లాడుతూ.. వైద్యురాలి ఘటనపై 20, 21వ తేదీలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు చేయాలని పిలుపునిచ్చారు. అలాగే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల ఖాళీల్లో పదోన్నతులను వెంటనే చేపట్టాలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు కె. వేణుగోపాల్, హనుమాండ్లు, కె.రమణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తాబాదిలో కొవ్వొత్తులతో నివాళి

బాన్సువాడ రూరల్: వైద్యురాలిపై హత్యాచారం ఘటన అమానవీయమని కొత్తాబాది గ్రామ యువకులు అన్నారు. మృతి చెందిన వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. దేశంలో రోజురోజుకు మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని వాపోయారు.యువకులు గంగాధర్, వికాస్, షాదుల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

బారెదు పోచమ్మ బోనాల పండుగ



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో ఆదివారం బారెదు పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చుక్కాపూర్‌కు పోటెత్తిన భక్తులు



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు,అర్చకులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో నందిత సహిత శత రుద్రాభిషేకం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి విశ్వనాథేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కాశీ నుంచి తీసుకొచ్చిన 108 నందిత సహిత శివలింగాలకు వేదపండితులు, శివయోగి ముత్యంపేట కేదారనాథ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివయోగి కేదారనాథ శర్మ మాట్లాడుతూ.. జీవితంలో ఒకసారైన కాశీ విశ్వనాథున్ని సందర్శించి తరించాలని అన్నారు. పలువురు అర్చకులు, జంటలు, మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో సామూహిక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): చిన్నదేమిశివారులో గల మైసమ్మ ఆలయంలో ఆదివారం ట్రాక్టర్ యజమానుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి ఈ ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలు బాగాపండాలని అమ్మవారిని వేడుకున్నారు.

నీలకంఠేశ్వరాలయంలో లక్ష బిల్వార్చన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని నీలకంఠేశ్వరాలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ పూజారులు సంగమేశ్వరప్ప, నీలకంఠం తెలిపారు. శ్రావణమాసంలో భాగంగా శివుడికి భక్తులు భాగ్యరేఖ–బాలకిషన్ దంపతులు లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నంబర్‌ప్లేట్ లేని వాహనాల సీజ్



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. బిచ్కుంద సీఐ నరేష్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నలుగురు ఎస్సైలు, పోలీసు బలగాలతో పాత జాతీయ రహదారిపై క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు. నంబర్ ప్లేట్ లేని 20 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు వారు తెలిపారు. నలుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు వారు చెప్పారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పకుండా హెల్మెట్ పెట్టుకోవాలని, లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన పత్రాలు ఉండాలన్నారు.

అధ్వానంగా తాడ్వాయి–దేవాయిపల్లి రోడ్డు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి దేవాయిపల్లి మీదుగా బ్రాహ్మణపల్లి వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు వేసి కూడా కొన్నేళ్లు మాత్రమే అయింది. పూర్తిగా గుంతలమయంగా మారింది. ప్రతి రోజు ఈ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై వెళ్లే ద్విచక్రవాహనదారులు తరచుగా జారిపడడంతో గాయాలైన సందర్భాలు ఉన్నాయి. రోడ్డు మధ్యలో నిర్మించిన కల్వర్టు పూర్తిగా ధ్వంసమైంది. రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రోడ్డును బాగు చేయించాలని కోరుతున్నారు.

సమాచారం..

నేడు గిరిజన విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు

బాన్సువాడ రూరల్: కోనాపూర్–హన్మాజీపేట్ తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గానూ పరిమిత సంఖ్యలో ఖాళీగా ఉన్న సీట్లకు సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శ్యామలాదేవి తెలిపారు. నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాల, కళాశాలలో ఆసక్తి, అర్హత గల విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు వచ్చి సర్టిఫికేట్లను సమర్పిస్తే స్పాట్ అడ్మిషన్ ఇస్తామన్నారు. 5, 7వ తరగతితో పాటు ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

తీజ్ ఉత్సవం గిరిజన సంస్కృతికి ప్రతీక

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



కామారెడ్డి టౌన్: తీజ్ ఉత్సవాలు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు, పర్యావరణహిత జీవనానికి ప్రతీక అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కాలనీలో బంజార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ పండుగ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. సంస్కృతీ సంప్రదాయాలను ప్రతి ఒక్కరు కాపాడాలని కోరారు. ఎంపీ సురేష్ షట్కార్, కాంగ్రెస్,బంజార సంఘం నాయకులు పాల్గొన్నారు.

శేర్‌శంకర్ తండాలో..



రాజంపేట: శేర్‌శంకర్ తండాలో ఆదివారం తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. గిరిజన సంస్కృతికి ప్రతీకగా తీజ్ పండగను శ్రావణ మాసంలో ఘనంగా జరుపుకుంటారు. తీజ్ ఉత్సవాల్లో భాగంగా యువతులు 9 రోజుల పాటు గోధుమ నారుకు నీరు పోస్తూ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. యువతులు గోధుమ మొలకల బుట్టలను నెత్తిపై పెట్టుకుని కుటుంబ సభ్యులతో తండాపెద్దలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

పీఆర్‌టీయూ భవనాలకు నిధులు మంజూరు



కామారెడ్డి అర్బన్: పీఆర్‌టీయూ టీఎస్ భవనాల నిర్మాణానికి సీడీపీ ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.25 లక్షలు మంజూరు చేస్తూ ఆదివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి ఉత్తర్వులు అందజేశారు. భిక్కనూర్ పీఆర్‌టీయూ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, ఎల్లారెడ్డి భవనానికి రూ.10 లక్షలు, కామారెడ్డి భవనానికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. నెల రోజుల్లో నిధులు విడుదల చేయాలని ఈ మేరకు సిద్దిపేట కలెక్టర్‌కు ఆయన సిఫార్సు చేశారు.